క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త హన్మంతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భార్య భాగ్యమ్మకు సోమవారం పార్టీ పరంగా రూ. 2లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి సభ్యత్వం కలిగి ఉండి ఎదైన ప్రమాదం జరిగి మృతి చెందితే వారి కుటుంబానికి మన పార్టీ అడ్డగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, రఘు, మల్లేష్ పాల్గొన్నారు.

దామరగిద్ద: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముస్తాపేట్ గ్రామానికి చెందిన రవిగౌడ్ విద్యుదాఘాతానికి గురై మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వ బీమా సొమ్ము రూ. 2లక్షల చెక్కును బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. అలాగే నర్సపూర్ బీఆర్ఎస్ కార్యకర్త తిర్మలప్ప (38) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తిర్మలప్ప భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తోపాటు నాయుకులు ఎంపీపీ నర్సప్ప, మండల అధ్యక్షుడు సుభాష్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కిషన్‌రావు, బసంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కోస్గి: పట్టణ ప్రధాన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఇళ్లు కోల్పోయిన బాధితులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సింహులు, సాయిలు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇళ్లు కోల్పోయిన పేదలందరికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించడంతోపాటు స్థలాలు గుర్తించి ఇంటి నిర్మాణాలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో పలువురు బాధితులు ఉన్నారు.

ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి..

దామరగిద్ద: మండలంలోని నర్సాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కావలి తిర్మలప్ప(38) ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. కావలి తిర్మలప్ప ఆదివారం సాయంత్రం గడిమున్కన్‌పల్లికి బైక్‌పై వెళ్తుండగా మల్‌రెడ్డిపల్లి చెరువుకట్ట సమీపంలో గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలాడు. అటుగా వెళ్తున్న మల్‌రెడ్డిపల్లి గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకోగా అప్పటికే మృతిచెందడంతో బోరున విలపించారు. తిర్మలప్పకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



మాగనూర్ (కృష్ణా): మండల పరిధిలోని ముడుమాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ముడుమాల్ గ్రామానికి చెందిన దివంగత తిమ్మిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు పాఠశాలకు 12 ఫ్యాన్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. సభ్యులు నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విజయ్‌మోహన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరించాలి

మదనాపురం: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు ఆధ్వర్యంలో ఇళ్లలో ఉంటున్న ప్రజలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించి 8 నెలలు పూర్తి కావస్తున్నా.. వసతులు లేక సతమతం అవుతున్నారని, తాగునీటి వసతి లేదని దుయ్యబట్టారు. బాత్రూంలోని నీళ్లు బయట రోడ్లపై పారుతుందన్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీ వాళ్లు బురదలో నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ అబ్రహాంలింకన్, ఎంపీఓ పుష్పకు వినతిపత్రం అందించారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రత్యేక పాలనలో పట్టింపు కరువు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: చెత్తతో సంపద సృష్టిపై పట్టింపు కరువైంది. గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రత్యేక పాలనలో ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. గత ప్రభుత్వ హయంలో ప్రతీ పంచాయతీకి ఉపాధి నిధుల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. స్వచ్ఛ భారత్, సర్వేక్షణ్ గ్రామీణ పథకాలలో భాగంగా చాలా చోట్ల వీటిని ఉపయోగించి సంపదను సృష్టించారు. కానీ ప్రత్యేక అధికారుల పాలనలోకి గాలికి వదిలేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించి వాటిని సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలు సంపద సృష్టించే విధంగా ప్రణాళికను రూపొందించారు. కానీ సర్పంచ్‌లు కాలం పూర్తి కావడం, ప్రత్యేకాధికారుల పాలనలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రస్తుతం ఇళ్లనుంచి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులలో లేదా రోడ్ల పక్కన పడేస్తున్నారు.

ఎరువుల తయారీ ఇలా..

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేస్తారు. తడి చెత్తను డీ కంపోస్ట్ చేయడంతో రెండ్రోజులు పూర్తిగా కుళ్లి పోతుంది. దీనిని సెగ్రిగేషన్ షెడ్లలో ఉన్న బెడ్‌పై వేయడంతో అప్పటికే బెడ్‌లో ఉన్న వానపాముల చెత్తను సేంద్రియ ఎరువులుగా మారుస్తాయి. సేంద్రియ ఎరువుల తయారికి ఉపయోగపడే వానపాములకు పోషకాలను కూడా అందిస్తారు. తయారుచేసి సేంద్రియ ఎరువులను 20, 50 కిలోల బస్తాల్లో విక్రయిస్తారు.



అమ్మపల్లిలో నిరూపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు (ఫైల్)



ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించిన దృశ్యం (ఫైల్)

వినియోగంలోకి తీసుకొస్తాం..



మండలంలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారడం అనే మాట వాస్తవమే. ప్రత్యేక పాలన కొనసాగుతుండటంతో కొంత మేర ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించలేకపోయాం. పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ తడిపొడి చెత్త తయారి మొదలుపడుతాం.

– జైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, మాగనూర్

ఉపయోగంలోకి తీసుకురావాలి..



గత ప్రభుత్వ హయంలో తీసుకొచ్చిన సెగ్రిగేషన్ షెడ్లు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. ఇలా చేయడం ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం కోల్పోవడంతోపాటు లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు దిష్టిబొమ్మలుగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– ఈశ్వర్‌యాదవ్, నేరడగం

పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలి..



ప్రత్యేక పాలనలో గత కొన్ని రోజులుగా మండలంలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారడంతో రోజు ఉదయం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్న ట్రాక్టర్లతోపాటు సిబ్బందికి అయ్యే ఖర్చు మొత్తం వృథాగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తడి–పొడి చెత్తనుంచి ఆదాయం సమకురేలా చర్యలు తీసుకోవాలి.

– కనకరాజు, ఉజ్జెల్లి గ్రామస్తుడు

ఇంటింటికీ వైద్య పరీక్షలు

మరికల్: మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం ఇంటింటికీ వెళ్లి సీజన్ వ్యాధులు రాకుండా వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఎంతమంది ఉన్నారో వారి వివరాలు సేకరించి ఆ కుటుంబంలో ఎవరైన దీర్ఘకాలిక వ్యాధులతో కాని తరచుగా అనారోగ్య బారిన పడుతున్న వారికి ఆశాకార్యకర్తలు బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించారు. వారికి కావాల్సిన మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ఊట్కూరు: వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని సోమవారం మండలంలోని మల్లెపల్లిలో చిన్నారులు జల్దిబిందెలతో ఊరేగుతూ శివలింగానికి, పోతురాజు విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై పక్షం రోజులు అవుతున్న వర్షాలు కురవడం లేదని సమృద్ధిగా వర్షాలు కురవాలనే నేపంతో భక్తి శ్రద్ధలతో జలాభిషేకం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటప్ప, నర్సింహ, కతలప్ప, అంజనేయులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రంలో అడ్మిషన్లు ప్రారంభం



అడ్మిషన్లు అందిస్తున్న సూపరింటెండెంట్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నూతనంగా చేరిన చిన్నారులకు అడ్మిషన్లు చేయించారు. పిల్లలకు చదువుతోపాటు కళలలో ప్రావిణ్యం సంపాదించుకునేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని, ప్రతి రోజు సాయంత్రం 5నుంచి 7గంటల వరకు నిర్వహించే శిక్షణ శిబిరానికి చిన్నారులను పంపించాలని కోరారు. తబల, నృత్యం, గాత్రం, చిత్రలేఖనం తదితర విషయాల్లో తర్ఫీదును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 16 సంవత్సరాల లోపు చిన్నారులు అర్హులని అడ్మిషన్‌కు రూ.50 చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీలకు రూ.20మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, లక్ష్మణ్, వసంత్, రామకృష్ణ, జ్ఞానామృత పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నరేష్

నారాయణపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ కఠినంగా వ్యవహరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలను సోమవారం సంఘం సభ్యులు పరిశీలించగా పుస్తకాలతో పాటు ఇతర వస్తువులు అమ్ముతున్నారని, వెంటనే విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మార్చుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని కోరుతూ డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘనికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 26న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఇంతియాజ్, పట్టణ కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షుడు వివేకానంద, లక్ష్మణ్, సతీష్, వరుణ్ పాల్గొన్నారు.

మక్తల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్రంలో 26న బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు మౌళిక వసతులు కరువైందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా పుస్తకాలను అందించాలని ఆయన కోరారు. వసతి గృహాలపై తనిఖీలు నిర్వహించాలని, డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాల అదనపు గదులు నిర్మించండి

మాగనూర్: ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తామంటున్నా పాలకుల మాటలు నీటి మూటలే అవుతున్నాయి. మండలంలో పలు పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన అదనపు గదుల నిర్మాణం ముందుకు సాగడం లేదు. మండల పరిధిలోని మందిపల్లి ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం పిల్లర్ల స్థాయిలోనే వదిలేయడంతో విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణం పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

సమగ్ర చట్టాల కోసం పోరాటం చేద్దాం



నారాయణపేట రూరల్ : వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి సమగ్ర చట్టాలను రూపొందించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. దేశంలో 60శాతం వ్యవసాయ రంగాన్ని నమ్ముకుని రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారని, 14కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నప్పటికి వారి కోసం సరియైన చట్టాలు లేకపోవడం విచారకరమన్నారు. కనీస వేతనం రూ. 600కు పెంచాలని, ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షల రుణం, నాణ్యమైన విద్య, వైద్యం తదితర డిమాండ్లను పరిశీలించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకట్రాములు, నారాయణ, హజి, మెగలప్ప, హన్మంతు, రాఘవేందర్, సాయిలు, లక్ష్మప్ప, జగ్గప్ప, జనార్ధన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మాగనూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండలంలోని నేరడగం కాంప్లెక్స్ హెచ్ఎం శంకరాచారి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని వర్కూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ మేరకు.. ఆయన పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనంలో నాణ్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు ప్రశాంత్, సీఆర్పీ ఎల్లాగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయులు

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతీ మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. 5సంవత్సరాలు పైబడిన బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కుసుమకుమారి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, సుజాత తదితరులు పల్గొన్నారు.

ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు

- నిర్ధారించిన అధికారులు
- 10 శాతం ప్లాట్లు, ఆలయ భూముల పరిశీలన



పరమేశ్వరస్వామి చెరువు భూమిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్: వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో అక్రమ కట్టడాలు, వెంచర్లలో మున్సిపాలిటీకి కేటాయించిన పదిశాతం ప్లాట్లల్లో కబ్జాలను అధికారులు నిర్ధారించారు. సోమవారం తహసీల్దార్ రాజు, పురకమిషనర్ నాగరాజు బృందం ఆలయ, 10 శాతం భూములను పరిశీలించారు. ఆత్మకూర్ శివారులోని సర్వే నంబర్లు 430, 439, 441లలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 42.25 ఎకరాల స్థలం ఉందని.. సోమవారం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించగా ఒక ఎకరాకు పైగా కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం కబ్జాకు గురైన స్థలంలో అక్రమంగా కట్టడాలు వెలిశాయని, వివరాలను సేకరించినట్లు తెలిపారు. అలాగే పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూమిలో అక్రమంగా ఎనిమిది దుకాణ సముదాయాలను నిర్మించినట్లు సర్వే అనంతరం గుర్తించామని వివరించారు. వేంకటేశ్వరస్వామి ఆలయం, వివిధ వెంచర్ల ద్వారా కేటాయించిన 10 శాతం ప్లాట్లు, పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూముల్లో అన్యాక్రాంతాలను గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదించామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ, సర్వేయర్ మన్యం, పురపాలిక సిబ్బంది ఉన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన



గుంటిపల్లిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని హెచ్ఎం వగ్గు ఉమాశంకర్, సీఆర్పీ సౌమ్యరాణి తెలిపారు. సోమవారం మండలంలోని గుంటిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏకోక్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులతో మొక్కలు నాటించి పర్యావరణానికి కలిగే మేలు గురించి, నీటిని పొదుపుగా వాడుకోవడం, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగు, సాగునీరు, విద్యుత్, పౌర సరఫరాలు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, సెర్ప్, ఉపాధిహామీ, పశువైద్యం, ఆబ్కారీ, హార్టికల్చర్, తదితర శాఖల కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

నారాయణపేట: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్క్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, యూనిఫారాలు, ఈఎస్ఐ, పీఎఫ్, తదితర చట్టబద్ధమైన సౌకార్యాలు కల్పించాలన్నారు. వంటపాత్రలు, సబ్సిడీపై సిలిండర్, షరతుల్లేని బ్యాంకు లోన్లు ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ నారాయణకు అందజేశారు. ధర్నాలో నాయకులు జోషి, జయంతి, తిరుపతమ్మ, మణిమాల వెంకటమ్మ, రాధ,యాదమ్మ పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని రహదారి



మల్లెపల్లి స్టేజ్ వద్ద రోడ్డుపై గుంతలు

- నిత్యం వందలాది వాహనాల రాకపోకలు
- భయాందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

ఊట్కూర్: నారాయణపేట–మక్తల్ రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. రోడ్డుపై అడుగడుగున గుంతలు ఉండంతో రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. మక్తల్ నుంచి నారాయణపేట–సింగారం చౌరస్తావరకు 25 కిమీ రహదారి ఉంది. రహదారిపై రాయచూర్, గద్వాల, నారాయణపేట, తాండూర్, కొడంగల్, గుల్బర్గ తదితర పట్టణాలకు ప్రయాణిస్తుంటారు. రహదారిపై అడుగడుగున గుంతలు ఏర్పడడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం వస్తుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. లింగంపల్లి గేట్‌నుంచి తిప్రాస్‌పల్లి వరకు 15 కిమీ. రోడ్డుపై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో గుంతల్లో వరద నీరు చేరడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినే ప్రమాదముంది. రోడ్డుపై అధికలోడ్‌తో ఇసుక టిప్పర్లు తిరుగుతున్న, మైనింగ్ అధికారులు, ఆర్‌టీఓ అధికారులు తనిఖీలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఊట్కూర్ సమీపంలో ఓ పార్టీ నాయకుడు మొరం వేసి తాత్కలికంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. పలుమార్లు ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపిన పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఊట్కూర్ శివారులో రోడ్డుపై మొరంతో మరమ్మతులు ఇలా..

మరమ్మతు చేపట్టాలి



మక్తల్–నారాయణపేట రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. తిప్రాస్‌పల్లి నుంచి లింగంపల్లి స్టేజ్ వరకు రోడ్డుపై గుంతలు అధికంగా ఉన్నాయి. రాత్రి వేళలో ప్రమాదాలు జరగవచ్చని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

–అనిల్‌కుమార్, ఊట్కూర్

నిధులు మంజూరు చేయించాలి



మక్తల్–నారాయణపేట రహదారిపై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

–బీ.నారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు, ఊట్కూర్